# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 11-07-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ అత్యాధునిక యుద్ధ నౌక ఐఎన్ఎస్ మహేంద్రగిరిని.. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ విశాఖపట్టణంలో ఈరోజు జాతికి అంకితం చేశారు.
- ❖ జనాభా వృద్ధితోనే ఆర్థికాభివృద్ధి సాధ్యపడుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ❖ గోదావరి పుష్కరాలను దేశంలోనే ఆదర్శవంతమైన ఆధ్యాత్మిక ఉత్సవంగా నిర్వహించనున్నట్లు మంత్రి పి. నారాయణ తెలిపారు.
- ❖ వియత్నాం బోటు ప్రమాదంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు మృతి చెందారు.
- ❖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రులు కొలుసు పార్థసారథి, అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు.

======================

ప్రస్తుత పశ్చిమాసియా సంక్షోభ పరిస్థితుల మధ్య భారత నౌకాదళం దేశ ఆర్థిక స్థిరత్వానికి బలమైన రక్షణ కవచంగా నిలిచిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు. విశాఖపట్నంలోని నావల్ డాక్‌యార్డ్‌లో అత్యాధునిక స్టెల్త్ ఫ్రిగేట్ `ఐఎన్ఎస్ మహేంద్రగిరి` నౌకను ఈరోజు అధికారికంగా ఆయన తూర్పు నౌకాదళంలోకి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ `ఆపరేషన్ ఊర్జా సురక్ష` ద్వారా రక్షణ రంగం వాణిజ్య నౌకలకు రక్షణ కల్పించినట్లు తెలిపారు. ప్రాజెక్ట్ 17A కింద నిర్మించిన చివరి ఫ్రిగేట్ క్లాస్ యుద్ధనౌక అయిన `ఐఎన్ఎస్ మహేంద్రగిరి` నౌకాదళ బలాన్ని మరింత పెంచుతుందని మంత్రి తెలిపారు. భారత సముద్ర శక్తికి విశాఖపట్నం ఎంతో కీలకమైనదన్నారు. ఆంధ్రప్రదేశ్.. రక్షణ, ఏరోస్పేస్ తయారీ రంగానికి ప్రధాన హబ్‌గా మారుతోందని ప్రశంసించారు. అనకాపల్లి జిల్లాలోని `భారత్ డైనమిక్స్ లిమిటెడ్` డైనమిక్ సిస్టమ్స్ మ్యానుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ, కర్నూలులో `డ్రోన్ సిటీ` వంటి భారీ ప్రాజెక్టులు వాయు, నౌకా, డ్రోన్ రంగాలలో దేశ రక్షణ సామర్థ్యాలను మరింత బలోపేతం చేస్తున్నాయని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

=====================

జనాభా వృద్ధితోనే ఆర్థికాభి వృద్ధి సాధ్యపడుతుందని.. సరిపడా జనభా లేకుంటే అనేక సమస్యలు వస్తాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. విజయవాడలోని అంబేద్కర్ కళావేదికలో ఈరోజు నిర్వహించిన ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... దక్షిణ భారత్ లో జనభా రేటు తగ్గుతోందన్నారు. పిల్లలు వద్దనుకునే దంపతులు పెరగడం దురదృష్టమని అన్నారు. పిల్లలే మన రాష్ట్ర సంపద అని పేర్కొన్నారు. తెలుగు జాతి గర్వపడేలా అమారావతి నిర్మిస్తున్నామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తెలియజేశారు.

=====================

రాబోయే 2027 గోదావరి పుష్కరాలను దేశంలోనే ఆదర్శవంతమైన ఆధ్యాత్మిక మహోత్సవంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తో కలసి ఆయన ఈరోజు రాజమహేంద్రవరంలో పర్యటించి పుష్కరాల ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ... 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు జరిగే గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో సిద్ధమవుతోందన్నారు. అనంతరం మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... పుష్కరాలు జరిగే ఆరు జిల్లాల్లో ఏర్పాట్లు చేస్తున్నామని తెలియజేశారు.. `అఖండ గోదావరి` పర్యాటక ప్రాజెక్టు ద్వారా గోదావరి పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నామని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 22 సెకన్లు)

=====================

వియత్నాంలో భారతీయులు ప్రయాణిస్తున్న స్పీడ్ బోటు ఫూ క్వాక్ ద్వీపం సమీపంలో బోల్తా పడింది. ఈ ఘటనలో తెలుగు రాష్ట్రాలకు చెందిన  పలువురు పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. ఓ మొబైల్ కంపెనీ భారత్ నుంచి డిస్ట్రిబ్యూటర్ల కుటుంబాలను వియత్నాం పర్యటనకు తీసుకెళ్లింది. మొత్తం 250 మంది ఈ యాత్రకు వెళ్లారు. ఈ ప్రమాదంపై వియత్నాంలోని భారత ఎంబసీ స్పందిస్తూ... సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు తెలియజేసింది. బాధితుల కోసం కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొంది.

=====================

ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని మంత్రులు కొలుసు పార్థసారథి, అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సమావేశమయ్యారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈరోజు జరిగిన ఈ సమావేశంలో ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు, సంక్షేమం, సేవా సంబంధిత అంశాలు, పెండింగ్‌లో ఉన్న డిమాండ్లపై ఉద్యోగ సంఘాల ప్రతినిధులు చర్చించారు. ఉద్యోగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. వారి న్యాయ పరమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

విరామం

=====================

టీబీ రహిత భారతదేశం లక్ష్య సాధనతో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కోరారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు ఏరియా ఆసుపత్రిలో `ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్`లో భాగంగా హ్యాండ్ హెల్డ్ ఎక్స్-రే మిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ ఎక్స్-రే మిషన్ ద్వారా సాలూరు ఏరియా ఆసుపత్రి టీబీ యూనిట్ పరిధిలోని 28 హైరిస్క్

గ్రామాల్లో ప్రత్యేక టీబీ స్క్రీనింగ్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. గిరిజన గ్రామాల్లోనే ఛాతీ ఎక్స్-రేలు, కఫ పరీక్షలు నిర్వహించి టీబీని ప్రారంభ దశలోనే గుర్తించి బాధితులకు సకాలంలో చికిత్స అందించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

======================

మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా ఉపాధి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ విద్యార్థులకు సూచించారు. జేఎన్‌టీయూ - గురజాడ, విజయనగరం (జీవీ) తొలి స్నాతకోత్సవం ఈరోజు విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం కన్వెన్షన్ హాల్‌లో జరిగింది. 2023, 2024, 2025 విద్యా సంవత్సరాలకు చెందిన ఉత్తీర్ణులైన విద్యార్థులకు పట్టాలు, ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బంగారు పతకాలు, ఎండోమెంట్ అవార్డులు గవర్నర్ ప్రధానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కృత్రిమ మేధ, డేటాసైన్స్, రోబోటిక్స్ వంటి సాంకేతికతలను సమాజ శ్రేయస్సు కోసం ఉపయోగించాలన్నారు. యువత పరిశోధనలు, ఆవిష్కరణలు, అంకుర సంస్థల వైపు అడుగులు వేయాలని గవర్నర్ సూచిస్తూ...

(వాయిస్ 22 సెకన్లు)

ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ఆచార్య వీవీ సుబ్బారావు, వివిధ యూనివర్సిటీల వీసీలు, రిజిస్ట్రార్లు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు.

======================

ఆరోగ్యకరమైన, సంతోషకరమైన కుటుంబాలే సమాజానికి శ్రేయస్కరమని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈరోజు నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. దేశ ప్రగతికి, కుటుంబాల ఆర్థిక సుస్థిరతకు ఆరోగ్యవంతమైన జనాభా ఎంతో కీలకమన్నారు. తల్లీ, బిడ్డ ఇద్దరి ఆరోగ్యం బాగుండాలంటే కాన్పుకు, కాన్పుకు మధ్య కొంత ఎడం పాటించడం ఎంతో అవసరమన్నారు. "పిల్లల మధ్య ఎడమ పాటిద్దాం - ఆరోగ్యకరమైన సంతోషకరమైన కుటుంబాన్ని నిర్మిద్దాం" అనే నినాదంతో ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు.

======================

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ కు ముంబైలో నిర్వహించిన శస్త్ర చికిత్స విజయవంతం అయింది. డాక్టర్ దిన్షా పార్థివాలా నేతృత్వంలోని వైద్యుల బృందం పవన్ కళ్యాణ్ కుడి భుజానికి శస్త్ర చికిత్స నిర్వహించారు. రొటేటర్ కఫ్ ఇంజ్యూరీతో పాటు.. భుజానికి అవల్షన్ ఫ్రాక్చర్ ఉండటంతో శస్త్ర చికిత్స చేశారు. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. ఉపముఖ్యమంత్రి త్వరగా కోలుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకుని, ప్రజలకు మరింతగా సేవలు అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఒక ప్రకటనలో తెలిపారు.

======================

ఆంధ్రప్రదేశ్ లో దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తాంధ్రలో రేపు, ఎల్లుండు తేలిక పాటి నుండి మోస్తరు వర్షాలు లేదా జల్లులు ఒకటి రెండు చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ పేర్కొన్నారు. అలాగే బలమైన గాలులు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశముందన్నారు.

======================

విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రభుత్వం సమ ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి తెలిపారు. ప్రకాశం జిల్లా జరుగుమల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో క్రీడా పోటీలను ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రతి పాఠశాలలో క్రీడా మైదానాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని, నరేగా నిధులతో మైదానాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గురుకుల పాఠశాలలో ఇండోర్ స్టేడియాల నిర్మాణానికి కృషి చేస్తున్నామని మంత్రి తెలియజేశారు.

=======================

=======================